- బోనాల భక్తులపై లాఠీచార్జి

పోలీసులు మరోసారి లాఠీలకు పనిచెప్పారు. గతవారం బల్కంపేటలో జరిగిన ఘటన మరిచిపోకముందే ఆదివారం మరోసారి గోల్కొండ కోటలో భక్తులపై పోలీసులు తమ ప్రతాపం చూపారు.

నీటి సమస్యపై రోడ్డెక్కి నిరసన

రెండు వారాలుగా మిషన్ భగీరథ నీరు సరిగ్గా రావడం లేదని ఆగ్రహిస్తూ మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని గవ్వలపల్లి చౌరస్తా, అగ్రహారం, అంబాజీపేట గ్రామస్థులు రోడ్డెక్కారు. ఆదివారం ఖాళీ బిందెలతో గవ్వలపల్లి చౌరస్తాలో మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై గంటకు పైగా బైఠాయించారు.

– చిన్నశంకరంపేట

బీసీలకు రాజ్యాధికారం కావాలి

హక్కుల కోసం ఉద్యమిస్తాం: ఆర్ కృష్ణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

ఖైరతాబాద్, జూలై 14: బీసీలకు కావాల్సింది పదవులు కాదని, రాజ్యాధికారమని రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య పేర్కొన్నారు. తెలంగాణ మేధావుల సంఘం ఆధ్వర్యంలో 'బీసీ సమాజం అభివృద్ధి-తక్షణ కర్తవ్యం' అనే అంశంపై అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 76 ఏండ్లలో ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా బీసీలను పట్టించుకోలేదని ఆరోపించారు. 'ప్రతి గ్రామంలో వంద మంది బీసీలు విద్యావంతులుగా ఉన్నారని, వారికి పదవులు ఇవ్వాల్సి వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, కానీ తాము రాజ్యాధికారాన్ని కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రధాని స్థాయిలో బీసీ ఉంటే సరిపోదని, ఆ విధానాలను అవలంబించాలని పేర్కొన్నారు. ఇక రాష్ట్ర క్యాబినెట్‌లో ఉన్న 18 మంది మంత్రుల్లో కేవలం ఇద్దరు, 119 మంది ఎమ్మెల్యేల్లో 21 మంది మాత్రమే బీసీలని పేర్కొన్నారు. ఇక్కడే వివక్ష కనిపిస్తున్నదని, ఇక హక్కుల కోసం ఉద్యమించాల్సి ఉందని చెప్పారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ అసమానతలు తొలగించకుండా భారత్ పూర్తిగా ప్రజాస్వామిక దేశం కాదని స్పష్టం చేశారు. మాజీ ఐఏఎస్ చిరంజీవులు, తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ కేశవులు, రాజ్యాధికార సమితి అధ్యక్షుడు సురేశ్, మేధావుల సంఘం కన్వీనర్లు కిరణ్, శ్రీనివాస్ యాదవ్, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, సురేందర్, కార్యదర్శులు ఎం. నర్సయ్య, డీఎల్ఎన్ చారి, రాహుల్ దేవ్, డాక్టర్ ఎస్ ప్రమీల పాల్గొన్నారు.

భార్యతో గొడవ.. ఆత్మహత్యాయత్నం

- కుమార్తెతోపాటు 'పాలేరు'లో దూకబోయిన ఆటో డ్రైవర్

కూసుమంచి, జూలై 14: కుటుంబ కలహాలు, భార్యతో గొడవ పడిన ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు యత్నించాడు. క్షణికావేశంలో అభం శుభం తెలియని రెండేండ్ల కుమార్తెను పాలేరులో పడేసి తానూ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని జలాశయం వద్దకు చేరుకున్నాడు. చిన్నారిని జలాశయంలోకి విసిరేసే సమయంలో అక్కడికి వచ్చిన బ్లూకోల్ట్ కానిస్టేబుల్.. అతడి ప్రయత్నాన్ని అడ్డగించి పాపను చేతుల్లోకి తీసుకుని వారి ప్రాణాలు కాపాడాడు. ఈ ఘటన ఆదివారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో జరిగింది. కూసుమంచి మండలం జీళ్లచెరువు గ్రామానికి చెందిన జంపాల నరేశ్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సమస్యలతోపాటు భార్యతో గొడవపడి మనస్తాపం చెందాడు. క్షణికావేశానికి లోనై అదే మండలంలో ఉన్న పాలేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన రెండేండ్ల కుమార్తెను తీసుకొని పాలేరు రిజర్వాయర్ వద్దకు చేరుకున్నాక 100కు ఫోన్ చేశాడు. తన కుమార్తెను పాలేరులో పడేసి తాను కూడా ఆత్మహత్య చేసుకుంటున్నట్టు చెప్పి ఫోన్ కట్ చేశాడు. వెంటనే తన కుమార్తె అంగీకి రాళ్లు కట్టి ఆమెను జలాశయంలో పడేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. అప్పటికే సమచారం అందుకున్న కూసుమంచి బ్లూకోల్ట్ కానిస్టేబుల్ బ్రహ్మం.. క్షణాల్లో అక్కడికి చేరుకున్నాడు. పాపను జలాశయంలోకి విసురుతుండగా తన చేతుల్లోకి తీసుకున్నాడు. నరేశ్‌ను కూడా పక్కకు తీసుకొచ్చాడు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి నరేశ్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్నారిని అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. క్షణాల్లో స్పందించి మెరుపువేగంతో వెళ్లి ఇద్దరిని కాపాడిన బ్లూకోల్ట్ కానిస్టేబుల్ బ్రహ్మంను పోలీసులు, మండల ప్రజలు అభినందించారు.

బీడీలమ్మిన దానంకు ఇన్ని కోట్లా?

- దానం కబ్జాల బాగోతాలు బయటకు తీస్తాం
- కేటీఆర్‌ను విమర్శించే స్థాయి నీకు లేదు
- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఫైర్

ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): బీడీలు అమ్ముకున్న దానం నాగేందర్.. ఇన్ని వేల కోట్లు ఎలా సంపాదించారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. దానం తన ఇంటి చుట్టూ, హైదరాబాద్‌లో చేసిన భూకబ్జాల బాగోతాలన్నీ బయటికి తీస్తామని హెచ్చరించారు. కబ్జాకోరు, చీటర్, రౌడీషీటర్ అయిన దానం నీతులు చెప్పడం తగదని హితవు పలికారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శించే స్థాయా? అని నిలదీశారు. ఆదివారం తెలంగాణభవన్‌లో కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. స్థాయిమర్చి నోటికొచ్చినట్టు మాట్లాడొద్దని దానం నాగేందర్‌ను హెచ్చరించారు. 2018 జూన్ 22న బీఆర్ఎస్‌లో చేరినప్పుడు. 'కాంగ్రెస్ అన్యాయం చేస్తున్నది.. కేసీఆర్ దయ వల్ల రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన..' అని చెప్పిన దానం ఇప్పుడు సిగ్గు, శరం లేకుండా మాట్లాడటం తగదని మండిపడ్డారు. అందితే జుట్టు అందకపోతే కాళ్లు పట్టుకొనే రకం దానం అని ఎద్దేవా చేశారు. పార్టీ మారిన నేతలందరూ రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ చేశారు.

డీఎస్సీని వాయిదా వేయాలి

డీఎస్సీని వాయిదా వేయాలని, ప్రిపరేషన్‌కు అభ్యర్థులకు సమయం ఇవ్వాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో 2.32 లక్షల ఉద్యోగాలు ఇచ్చారని, ప్రైవేట్ రంగంలో 10-12 లక్షల ఉద్యోగాలు సృష్టించారని చెప్పారు. దేశంలోనే అత్యధిక ఉద్యోగాలను కేసీఆర్ కల్పించారని వివరించారు. దేశంలోని ఏ కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రంలో ఇంత పెద్దమొత్తంలో ఉద్యోగాలు ఇచ్చారా? అని నిలదీశారు. ఇలా ఇచ్చినట్టు నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను తీసుకోవాలని నాడు అసెంబ్లీలో డిమాండ్ చేసిన భట్టి విక్రమార్క ఇప్పుడు ఎందుకు అమలుచేయడం లేదని నిలదీశారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి: మంత్రి పొంగులేటి

స్కాలర్‌షిప్ చెక్కులను అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో రెడ్డి జన సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి నర్సింహారెడ్డి, సలహాదారుడు ప్రొఫెసర్ దశరథ్‌రెడ్డి

సుల్తాన్‌బజార్, జూలై 14: విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం ఆబిడ్స్‌లోని రెడ్డి బాలుర వసతి గృహంలోని ఆడి టోరియంలో రెడ్డి జన సంఘం (ఆబిడ్స్) ఆధ్వర్యంలో 2023-24 విద్యాసంవత్సరానికి చెందిన ఇంజినీరింగ్, మెడికల్, గ్రాడ్యు యేషన్‌లో మెరిట్ సాధించిన 353 మంది విద్యార్థులకు రూ.30 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మొదట రాజా బహదూర్ వెంకటరామ్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్న రెడ్డి జన సంఘం కృషి అభినంద నీయమని కొనియాడారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి, నల్లగొండ ఎంపీ కుందూరి రఘువీర్‌రెడ్డిని జన సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి నర్సింహారెడ్డి సలహాదారులు ప్రొఫెసర్ కంచర్ల దశరథ్‌రెడ్డి, కోశాధికారి కాశిరెడ్డి పాండురంగారెడ్డితో కలిసి ఉపకార వేతనాల దాతలు డాక్టర్ మహిపాల్ రెడ్డి, ఆర్‌జేఎస్ సుకన్యారెడ్డి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బాలకృష్ణారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డి జన సంఘం అబిడ్స్ ఉపాధ్యక్షుడు తీగల బాల్‌రెడ్డి, సుకన్యారెడ్డి, స్వరూపా రాణి, కార్యదర్శి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి వీరారెడ్డి, సభ్యులు తీగల మోహన్ రెడ్డి, మర్రి ప్రభాకర్‌రెడ్డి, భారతి, మర్రి వామన్‌రెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, టాంకాం మాజీ చైర్మన్ బోయపల్లి రంగారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన వీహెచ్‌పీ న్యాయవాదుల జాతీయ సమావేశాలు

హైదరాబాద్, జూలై14 (నమస్తే తెలంగాణ): శంషాబాద్‌లోని ముచ్చింతల్ త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఆశ్రమంలో రెండు రోజులుగా కొనసాగుతున్న వీహెచ్‌పీ న్యాయవాదుల విభాగం మూడో జాతీయ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ప్రభుత్వాల ఆజమాయిషీ నుంచి హిందూ దేవాలయాల తొలగింపు, జనాభా అసమతుల్యత, రిజర్వేషన్లు, మతమార్పిడి తదితరవాటిపై చర్చించి తీర్మానాలు చేశారు. సమావేశంలో వీహెచ్‌పీ కేంద్రీయ అధ్యక్షుడు అలోక్ కుమార్, సహ ప్రధాన కార్యదర్శి సురేంద్రజైన్, లీగల్‌సెల్ జాతీయ కన్వీనర్ దిలీప్ త్రివేది, జాతీయ కోకన్వీనర్ అభిషేక్, కో కన్వీనర్ శ్రీనివాస్, 150 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

'మున్నూరుకాపు సంఘాన్ని పటిష్టపరచాలి'

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): మున్నూరుకాపు సంఘాన్ని గ్రామం నుంచి పటిష్టపరచాలని అపెక్స్ కౌన్సిల్ తీర్మానం చేసింది. ఆదివారం రాజ్యసభ సభ్యుడు, మున్నూరు కాపుసంఘం గౌరవాధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర అధ్యక్షతన హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమ రావు, సభ్యులు రౌతు కనకయ్య, సీ విఠల్, బొంతు రామ్మోహన్, ఆకుల రజిత్, నాగేందర్, మరికల్‌పోత సుధీర్ కుమార్, విష్ణు జగతి, ఆది విష్ణుమూర్తి, కొత్త లక్ష్మణ్, లవంగాల అనిల్, ఆవుల రామారావు పాల్గొన్నారు.

పాఠశాలలను బలోపేతం చేద్దాం: కోదండరాం

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ప్రొఫెసర్ కోదండరాం ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. టీచర్ల బదిలీలు, పదోన్నతులతో ప్రభుత్వం పాఠశాలల్లోని అన్ని ఖాళీలను నింపే ప్రయత్నం చేసిందని, ఇక నుంచి బడుల బలోపేతంపై దృష్టిపెట్టాలని సూచించారు. ఆదివారం కాచిగూడలోని ఎన్టీయూ భవన్‌లో రాష్ట్రస్థాయి కార్యకర్తల శిక్షణా శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, బదిలీ అయిన టీచర్లను రిలీవ్‌చేయాలని ఎన్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం పర్వత్‌రెడ్డి, కార్యదర్శి జీ సదానందంగౌడ్ విజ్ఞప్తిచేశారు.

జైళ్ల శాఖ బదిలీలను నిలిపేయాలి: వినోద్

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 14: రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా సోమవారం నుంచి జైళ్ల శాఖలో చేపట్టనున్న బదిలీలను తక్షణమే నిలిపివేయాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. తార్నాకలోని ఆయన కార్యాయలంలో ఆదివారం మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్రస్థాయి క్యాడర్‌గా ఉన్న వార్డర్స్, బగ్లర్స్ పోస్టులను తెలంగాణలో జిల్లా క్యాడర్‌గా మార్చి 2021 డిసెంబర్ 6న వివిధ జిల్లాలకు బదిలీ చేశారని వివరించారు. కాంట్రిజియస్ జీవో 54 ప్రకారం వీరిని జోనల్ విధానంలో సొంత జిల్లా నుంచి బదిలీ చేయనున్నారని చెప్పారు. ఐజీ స్థాయి అధికారులు దశాబ్దాలుగా ఒకే దగ్గర విధులు నిర్వర్తిస్తుండగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన వీరిని తెలంగాణలో సొంత జిల్లాలకు బదిలీ చేశారని గుర్తు చేశారు. నాలుగేళ్లు పూర్తికాకుండానే బదిలీలను చేపడుతున్నారని ఆరోపించారు. వారికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

ప్రభుత్వం పేరుతో వచ్చే ఈ-నోటీసులతో జాగ్రత్త

కేంద్రం అడ్వైజరీ

న్యూఢిల్లీ, జూలై 14: ప్రభుత్వ కార్యాలయాల నుంచి అనుమానిత రీతిలో ఈ-మెయిల్ వస్తే అందులోని అధీకృత అధికారి పేరు, విభాగాన్ని ధ్రువీకరించుకోవాలని కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోని భారత సైబర్ క్రైమ్ సమన్వయ కేంద్రం (ఐ4సీ) ఆదివారం ఒక పత్రికా ప్రకటనలో ప్రజలను కోరింది. ఈ-నోటీసుల పేరిట పదే పదే వచ్చే నకిలీ-ఈ మెయిళ్లను నమ్మి సైబర్ మోసాల బాధితులుగా మారొద్దని హెచ్చరించింది. ఇలాంటి మెయిళ్లను చెక్ చేసేముందు అవి gov.inతో అంతమయ్యే అధీకృత ప్రభుత్వ వైబ్‌సైట్ నుంచి వచ్చాయా లేదో సరి చూసుకోవాలని కోరింది. అనుమానం వస్తే ఇంటర్నెట్‌లో సంబంధిత అధికారి పేరు సరైందో కాదో చెక్ చేసి సంబంధిత విభాగానికి ఫోన్ చేసి కనుక్కోవాలని సూచించింది. వివిధ ఈ-మెయిల్ అడ్రస్సులతో వచ్చే నకిలీ నోటీసులకు స్పందించొద్దని.. వాటి గురించి దగ్గర్లోని పోలీస్ స్టేషన్ లేదా సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయొచ్చని తెలిపింది. గత వారం ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ సచివాలయంలోని పలువురు అధికారులకు ఈ తరహా నకిలీ ఈ-నోటీసులు వచ్చాయని చెప్పింది.

అతి విశ్వాసమే బీజేపీని దెబ్బ తీసింది

యూపీలో లోక్‌సభ ఫలితాలపై సీఎం యోగి ఆదిత్యనాథ్

లక్నో, జూలై 14: అతి విశ్వాసమే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని దెబ్బతీసిందని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ ప్రజలు అధికార బీజేపీకి ఊహించని షాక్ ఇచ్చారు. 2019లో 62 ఎంపీ స్థానాలు గెలుచుకున్న బీజేపీ, ఈ సారి 33 స్థానాలకు పరిమితమైంది. ఈ నేపథ్యంలో ఆదివారం లక్నోలో బీజేపీ యూపీ వర్కింగ్ కమిటీ సమావేశం వాడివేడిగా జరిగింది. సీఎం యోగి మాట్లాడుతూ, 'ప్రధాని మోదీ నాయకత్వంలో, యూపీలో ప్రతిపక్షంపై నిరంతరం ఒత్తిడి పెంచాం. దీంతో 2014, 2017, 2019 ఎన్నికల్లో విజయం సాధించాం. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు ప్రతిపక్షానికి బదిలీ అయ్యాయి. ఇది మన అతి విశ్వాసం వల్లే జరిగింది. మన అంచనాల్ని తలకిందులు చేసింది. ఓటమితో నీరసపడిన ప్రతిపక్షం.. ఇప్పుడు గెలుపును అందుకొని పుంజుకుంది' అని అన్నారు. ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు తాజాగా జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీజేపీ ఘోర పరాభావాన్ని పొందింది.

ఢిల్లీ దవాఖానలో కాల్పులు.. రోగి మృతి

న్యూఢిల్లీ: ఢిల్లీలోని జీటీబీ హాస్పిటల్‌లో ఓ టీనేజర్ ఆదివారం జరిపిన కాల్పుల్లో ఓ రోగి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రియాజుద్దీన్ (32) పొత్తి కడుపు ఇన్ఫెక్షన్‌తో గత నెల 23 నుంచి ఈ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. 24వ వార్డులో ఉన్న ఆయనపై 18 ఏళ్ల యువకుడు జరిపిన కాల్పుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారు. వ్యక్తిగత కారణాల వల్లే కాల్పులు జరిపినట్లు తెలుస్తున్నదని డిప్యూటీ పోలీస్ కమిషనర్ (సహదర) సురేంద్ర చౌదరి చెప్పారు.

30 ఏండ్లకు తెరుచుకున్న ఉమా భగవతి ఆలయం

శ్రీనగర్: జమ్ముకశ్మీరులోని అనంత్‌నాగ్ జిల్లాలో ఉన్న ఉమా భగవతి దేవాలయాన్ని సుమారు 30 ఏండ్ల తర్వాత తిరిగి తెరిచారు. కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ సమక్షంలో ఆదివారం ఉమా భగవతి ప్రాణప్రతిష్ఠ, పూజలు నిర్వహించారు. పునరుద్ధరణ పనులు పూర్తి కావడంతో ఈ దేవాలయంలో పూజలు చేయడానికి భక్తులకు అనుమతి ఇచ్చారు.

ఆగస్టునాటికి దేశవ్యాప్తంగా 'యూ-విన్'

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సాధారణ టీకాల కార్యక్రమ ట్రాకింగ్, నమోదు కోసం ఆగస్ట్ చివరి నాటికి యూ-విన్ పోర్టల్ అందుబాటులోకి రాను ందని అధికార వర్గాలు తెలిపాయి. కొవిడ్ వ్యాక్సినేషన్ పోర్టల్ కొ-విన్‌కు నకలుగా ఉండే ఈ పోర్టల్‌ను పశ్చిమ బెంగాల్ మినహా మిగతా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్నారు. గర్భిణులు, అయిదేండ్ల లోపు పిల్లలకు వేసే ప్రతి టీకాను యూ-విన్‌లో నమోదు చేయనున్నారు. క్యూఆర్ కోడ్ ఆధారంగా పని చేసే ఈ పోర్టల్‌లో ఈ-టీకా ధ్రువీకరణ పత్రాన్ని ఒక్క క్లిక్ ద్వారా పొరులెవరైనా పొందొచ్చు. రియల్ టైమ్‌లో పనిచేసే ఈ పోర్టల్ లేదా ఆండ్రాయిడ్ మొబైల్ అప్లికేషన్‌లో కోరుకున్న టీకా కేంద్రాల్లో టీకాలు పొందడానికి పౌరులు స్వీయ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. టీకా వేయించుకొనే టైమ్‌ను షెడ్యూల్ చేసుకోవచ్చు.

కర్ణాటకలో బస్సు చార్జీల మోత!

- ఏకంగా 20 శాతం మేర పెంపు?
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశాం
- కేఎస్ఆర్టీసీ చైర్మన్ శ్రీనివాస్ వెల్లడి
- గత నెల పెట్రోల్, డీజిల్‌పై పన్నును 4 శాతం పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఏడాదిగా ప్రజలపై పన్నుల మోత
- సిద్ధరామయ్య సర్కార్‌పై జనాగ్రహం

తుమకూరు/బెంగళూరు, జూలై 14: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో సామాన్య ప్రజలపై మరో భారం పడనున్నది. రాష్ట్రంలో త్వరలో బస్సు చార్జీలు భారీ స్థాయిలో పెరుగనున్నాయి. దీనిపై కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(కేఎస్ఆర్టీసీ) చైర్మన్ ఎస్ఆర్ శ్రీనివాస్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. ప్రభుత్వ బస్సుల్లో చార్జీల పెంపు అనేది అనివార్యమని ఆయన పేర్కొన్నారు. బస్సు చార్జీలను 15-20 పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేఎస్ఆర్టీసీ ఇప్పటికే ప్రతిపాదనలు పంపిందని వెల్లడించారు. 'రెండు రోజుల క్రితం మా బోర్డు సమావేశం జరిగింది. బస్సు చార్జీలను 15-20 పెంచాలని మేం ప్రతిపాదనలు పంపాం. మిగతాది సీఎం సిద్ధరామయ్య విచక్షణపై ఆధారపడి ఉంటుంది. కేఎస్ఆర్టీసీ మనుగడ సాగించాలంటే, చార్జీల పెంపు తప్పనిసరి' శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇంధన, బస్సుల విడి పరికరాల ధరలు పెరిగాయని చెప్పారు. 2019 నుంచి రాష్ట్రంలో చార్జీల పెంపు లేదని, అదేవిధంగా కేఎస్ఆర్టీసీ ఉద్యోగుల వేతనాల సవరణ కూడా 2020 నుంచి జరుగలేదని, కాబట్టి టికెట్ ధరలను పెంచడం అవసరమని చెప్పుకొచ్చారు. గత మూడు నెలల కాలంలో కార్పొరేషన్‌కు రూ.295 కోట్ల నష్టం వచ్చిందని వెల్లడించారు.

గత ఏడాదిలో పన్నుల మోత

ఐదు గ్యారెంటీల పేరుతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలపై పన్నుల మోత మోగిస్తున్నది. వివిధ రకాల పన్నులు, ఇతరత్రా రూపాల్లో సామాన్యుడి జేబును గుల్ల చేస్తున్నది. ఇప్పటికే గైడెన్స్ వ్యాల్యూ ట్యాక్స్, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, రవాణా వాహనాలపై అదనపు సెస్, ఈవీలపై లైఫ్ టైమ్ ట్యాక్స్‌ను ఇబ్బడిముబ్బడిగా వసూలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం గత నెలలో పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను దాదాపు 4 శాతం చొప్పున పెంచింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ.3, లీటర్ డీజిల్ ధర రూ.3.02 మేర పెరిగింది. మరోవైపు పాల ధరలను కూడా లీటర్, అర లీటర్ ప్యాకెట్లపై రూ.2 చొప్పున కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) పెంచిన విషయం తెలిసిందే.

గ్యారెంటీలకు అడ్డంగా కోతలు

గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఐదు గ్యారెంటీల ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టింది. ఆ గ్యారెంటీలను అమలు చేయాలంటే వేలాది కోట్ల రూపాయలు అవసరం. అయితే నిధుల అందుబాటును పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలుగా హామీలిచ్చేసిన కాంగ్రెస్.. అధికారం చేపట్టిన తర్వాత ఆయా గ్యారెంటీలకు ఆంక్షలు, కోతలతో ఎగనామం పెడుతున్నది. 'ఉచిత విద్యుత్తు' అంటూ ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెరతీశారని, మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహలక్ష్మి' స్కీమ్‌కు కొత్త ఆంక్షలు జోడించారని, ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చారని, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్నభాగ్య' ఇలా ప్రతీ స్కీమ్‌లోనూ కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

నిన్న వాల్మీకి.. నేడు వక్ఫ్ బోర్డ్

కర్ణాటకలో నిధుల గోల్‌మాల్

బెంగళూరు, జూలై 14: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో అవినీతి బాగోతాలు మెల్లమెల్లగా బయటపడుతున్నాయి. వాల్మీకి కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న భారీ కుంభకోణం (రూ.187 కోట్ల వరకు నిధుల దారిమళ్లింపు) మరువకముందే, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌లో మరో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. గతంలో వక్ఫ్ బోర్డ్ సీఈవోగా పనిచేసిన జుల్ఫీకరుల్లా రూ.4 కోట్ల నిధుల్ని అక్రమంగా తరలించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. నిధులు కాజేసిన అతడిపై చర్యలు చేపట్టాలని వక్ఫ్ బోర్డ్ ప్రస్తుత సీఈవో మీర్ అహ్మద్ అబ్బాస్ బెంగళూరులోని హై గ్రౌండ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వక్ఫ్‌బోర్డ్‌కు అతడి వల్ల రూ.8.03 కోట్లు నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు. 'గుల్బర్గా దర్గాలో వక్ఫ్ భూముల్ని తీసుకున్నందుకు ప్రభుత్వం రూ.2.29 కోట్లు చెల్లించింది. అలాగే ఎండోమెంట్ శాఖ నుంచి రూ.1.79 కోట్లు వక్ఫ్ బోర్డ్‌కు జమయ్యాయి. మొత్తం రూ.4,00,45,465 వక్ఫ్ బోర్డ్ బ్యాంక్ ఖాతాలో జమైంది. ఈ మొత్తాన్ని 2016 నవంబర్ 26న అప్పటి సీఈవో జుల్ఫీకరుల్లా తన బ్యాంక్ ఖాతాలోకి అక్రమంగా బదిలీ చేశాడు' అని సీఈవో అబ్బాస్ చెప్పారు. అయితే నిధుల్ని కాజేసిన ఇన్నేండ్ల తర్వాత 2024 జూన్ 12న వక్ఫ్ బోర్డ్ ఫిర్యాదు చేయటం సంచలనంగా మారింది. వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో జరిగినట్టుగానే వక్ఫ్ బోర్డ్‌లో నిధులు దారిమళ్లటం రాష్ట్రంలో సంచలనం రేపింది. వాల్మీకి స్కామ్‌లో ఏకంగా రాష్ట్ర మంత్రి బీ నాగేంద్ర సహా 11 మంది అరెస్టు అయ్యారు.

ఎక్స్‌లో 10 కోట్లకు చేరిన మోదీ ఫాలోయర్లు

న్యూఢిల్లీ: ఎక్స్ సామాజిక మాధ్యమంలో ప్రధాని మోదీ రికార్డు సృష్టించారు. ఆయనను ఫాలో అవుతున్నవారి సంఖ్య ఆదివారం 10 కోట్లను దాటింది. గడచిన మూడేళ్లలో దాదాపు 3 కోట్ల మంది ఫాలోయర్స్ పెరగడం విశేషం. అంతర్జాతీయ స్థాయిలో ఎక్స్ వేదికపై ఎక్కువ మంది ఫాలో అయ్యే ప్రభుత్వాధినేత మోదీనే. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు 2.75 కోట్ల మంది, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి 2.64 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు 3.81 కోట్ల మంది, తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌కు 2.15 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు.

అందరికీ ఇన్సూరెన్స్!

- బీమా చట్టానికి సవరణల